


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 93 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 93 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 13 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## మండలిలో మాటల యుద్ధం..

### బొత్స, మంత్రి పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!

- ఏపీ శాసనమండలిలో సంక్షేమ పథకాలపై తీవ్ర వాగ్వాదం
- ప్రభుత్వ వాదనలు అబద్ధమని, నిరూపిస్తే క్షమాపణ చెబుతానని బొత్స సవాల్
- బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి ప్రతిసవాల్
- అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపై ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం
- పింఛన్ల తొలగింపు ఆరోపణలపై వివరణ ఇచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు.

- మిగతా 2లో

### ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు

## నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

- పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్
- విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు
- పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**"నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

**మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ**

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

**విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి**

- మిగతా 2లో



## పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

### కొలికపూడికి పల్లా వార్నింగ్

- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారశైలిపై విమర్శలు
- అసెంబ్లీ లాబీలో కొలికపూడితో మాట్లాడిన పల్లా శ్రీనివాస్
- పార్టీతోనే గుర్తింపు, వ్యక్తిగతంగా జీరో అని గుర్తించాలంటూ హితవు

**పెన్ పవర్ డెస్క్:**తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో పల్లా సమావేశమయ్యారు.

- మిగతా 2లో

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

### సభలో ఎంపీ నోటీసు

- అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు
- నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు
- దేశాన్ని అమ్మేశారన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం



- మిగతా 2లో

## 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

**పెన్ పవర్ డెస్క్:**పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఇటీవల చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అయితే, రావల్పిండిలోని జైల్లో ఉన్న ఆయన పట్ల అక్కడి



- మిగతా 2లో



## అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- సరైన రవాణా సదుపాయం లేని గ్రామాలకు ప్రాణదాతలుగా డ్రోన్లు
- 20 నిమిషాల్లోపే అత్యవసర మందుల సరఫరా
- రెడ్ వింగ్ సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సరికొత్త సేవలు

**పెన్ పవర్ డెస్క్:**గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్

- మిగతా 2లో

### తిరుపతి లడ్డూ నెయ్యి: చంద్రబాబుపై

## భూమన ఆరోపణలు

- తిరుపతి లడ్డూ నెయ్యి సరఫరాపై సీఎం చంద్రబాబును ప్రశ్నించిన భూమన
- గతంలో హెరిటేజ్ సంస్థ రూ. 278కే నెయ్యి సరఫరా చేసిందని వెల్లడి
- ఇప్పుడు అదే సంస్థ రూ. 658కి సరఫరా చేయడంపై తీవ్ర ఆరోపణలు
- ధరల వ్యత్యాసం, నాణ్యతపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి ధర, నాణ్యత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు. గతంలో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తయారీ యూనిట్ అయిన ఇందాపూర్ ఫుడ్స్ అండ్



- మిగతా 2లో


## కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

- బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని కేసు నమోదు
- ఈ నెల 14న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన కోవూరు పోలీసులు
- మైనింగ్ కేసులో ఇప్పటికే బెయిల్ పై బయట ఉన్న కాకాణి

**పెన్ పవర్ డెస్క్:**గత కొన్ని రోజులుగా వైసీపీ నేతలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల అరెస్టులు, రిమాండ్లు అందరికీ తెలిసిందే. ఇప్పుడు మరో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంతు వచ్చింది.




- మిగతా 2లో



## విద్యార్థులకు మూడవ తరగతి నుంచి అందుబాటులోకి 'ఏఐ'

- విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందన్న కేంద్ర మంత్రి
- పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఏఐని అందుబాటులోకి తెస్తామన్న మంత్రి
- కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందన్న ధర్మేంద్ర ప్రధాన్

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

- వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని



- మిగతా 2లో




## కార్యకర్తలను విస్మరిస్తున్న పార్టీలు

రాజకీయ పార్టీల మనుగడ వెనుక ఆ పార్టీ కార్యకర్తల శ్రమ, త్యాగం ఆధారారపడి ఉన్నాయనేది నిర్వివాద అంశం. అదే రాజకీయ పార్టీలు ఇటీవలి కాలంలో కార్యకర్తలపట్ల అనుసరిస్తున్న వైఖరి అవకాశవాదాన్ని బట్టబయలు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఈ పరిణామం ప్రాంతీయ పార్టీలలో నూటికి నూరు శాతం కనిపిస్తూ ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం సామాన్య మానవునికి సైతం సులభంగా అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం, వైయస్ఆర్, కాంగ్రెస్, జనసేన పార్టీలు, తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధానంగా ప్రాంతీయ పార్టీలుగా మనుగడ సాగిస్తున్నాయి. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాల 302 రోజులు, 2001లో ఆవిర్భవించిన తెలంగాణ (భారత) రాష్ట్ర సమితి పార్టీ 9 సంవత్సరాల 187 రోజులు, 2011 లో ఆవిర్భవించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాలు అధికారం అనుభవించాయి. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో గత 17 నెలలనుంచి ప్రధాన భాగస్వామిగా అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఇంకా 3 సంవత్సరాలకు పైగా కచ్చితంగా అధికారంలో ఉంటాయి. కార్యకర్తల సమయం, డబ్బు, కుటుంబాల త్యాగ ఫలితంగానే ఈ విధంగా ప్రాంతీయ పార్టీలు అధికారాన్ని అనుభవిస్తూ సుదీర్ఘ కాలంనుంచి మనుగడ సాగిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ కార్యకర్తలు చనిపోయినప్పుడు సంబంధిత కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్సు చెక్, కార్యకర్తకు లేదా వారి కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారికి సిఎం రిలీఫ్ ఫండ్ తప్ప కార్యకర్తలకు ఇతర లబ్ధి చేకూరుతున్నట్లు ఏమీ కనిపించడం లేదు. వాస్తవంగా రాజకీయ చదరంగంలో పావులుగామారి చురుకుగా ఉండే కార్యకర్తలు అనేక మంది కేసుల్లో ఇరుక్కుంటున్నారు. వారిని పట్టించుకునే నాథుడే లేక వారు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరి కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. రాజకీయ వైరంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబ సభ్యులను సంబంధిత పార్టీ స్థానిక నాయకులు కలిసి తాత్కాలిక ఖర్చులకు కొద్దిగా డబ్బులు ఆ కుటుంబానికి ఇచ్చి పార్టీ మీకు అండగా ఉంటుందని సమయానుకూల హామీలు గుప్పిస్తారు. తరువాత ఎవరి దారి వారిదే. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు మాత్రం రోడ్లపాలే. కార్యకర్తలు తమ పార్టీలను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు.

కానీ రాజకీయ పార్టీలు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం. అధికారంలో లేనప్పుడు కుటుంబ సభ్యులుగా, అధికారంలో ఉన్నప్పుడు అంటరానివారుగా చూస్తూ కార్యకర్తల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిణామం అన్ని ప్రాంతీయ పార్టీలలో కనిపిస్తూ ఉంది. ప్రాంతీయ పార్టీలు అన్నీ వ్యక్తిగత పార్టీలు. అందువలన ఆ పార్టీలన్నీ వాటి అధినేతలైన ఏక వ్యక్తి నిర్ణయాలపైన ఆధారపడి వ్యవహారాలు నడిపిస్తూ ఉంటాయి. గత కొద్ది కాలంగా ఈ పార్టీలలో సిద్ధాంతాలు, విలువలు ఏమీ కనిపించడం లేదు. అధికారమే ధ్యేయంగా పార్టీలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. అధికారం లేనప్పుడు క్షేత్రస్థాయిలో అంకితభావంతో కష్టపడి పార్టీకి పని చేసిన వారికే టికెట్లు ఇస్తామని కార్యకర్తలకు, పార్టీ నాయకులకు పార్టీల అధిష్టానం తెలియచేస్తూ ఉంటుంది. పార్టీల అధిష్టానం మాటలను నమ్మి కార్యకర్తలు, నాయకులు ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుని పార్టీకి కష్టపడుతూ ఉంటారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ పార్టీల అధిష్టానం స్వరంలో మార్పు కనిపిస్తూ ఉండడం నిత్యకృత్యంగా మారింది. అందుకు డబ్బు, కులం, పరపతి కలిగిన వ్యక్తులను ఎక్కడెక్కడినుంచో తెచ్చుకుని వారికి ఎంఎల్ఎ, ఎం.పి. టికెట్లు కేటాయిస్తున్నారు.

మరికొన్ని పార్టీలైతే అప్పటి వరకు తమ పార్టీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన ప్రత్యర్థి పార్టీ నాయకులను స్థానిక కార్యకర్తలు, నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకుని వారికి టికెట్లు ఇస్తూ ఉన్నాయి. అయినా అధికారం కోసం కార్యకర్తలు, నాయకులు అధినేత నిర్ణయాన్ని గౌరవించి తమ అభ్యర్థి విజయానికి కష్టపడుతున్నారు. అధికారం లభించాకయినా రాజకీయ పార్టీలు కార్యకర్తలకు న్యాయం చేస్తున్నాయా? అంటే అదీ లేదు. అధికారం లభించాక డబ్బు, కులం, పరపతి అవసరంలేని శాసనసభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసనమండలి స్థానాలు, రాజ్యసభ స్థానాలు ప్రతి పార్టీకీ అనేకం లభిస్తాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను నాయకులుగా తయారుచేసి వారికి న్యాయం చేయాలని ఈ ప్రాంతీయ పార్టీలకు నిజంగా ఉంటే ఈ పదవులు వారికి ఇవ్వవచ్చు. కానీ ఇప్పటి వరకు ఏ పార్టీ అయినా సామాన్య కార్యకర్తకు ఎంఎల్ఎ కోటా, గవర్నర్ కోటాలోని శాసనమండలిలో స్థానం లేదా రాజ్యసభలో స్థానం కల్పించాయా? కనీసం నామినేటెడ్ పదవులలో కూడా క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఏ పార్టీ న్యాయం చేయడం లేదు అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో గ్రామస్థాయి నాయకునికి రాష్ట్ర స్థాయి పదవులు, ఎంఎల్ఎ స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకునికి చిన్న, చిన్న డైరెక్టర్ పదవులు కేటాయించడం అన్ని పార్టీలలో కనిపిస్తూ ఉంది.

ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయో? ఆ పార్టీల అధిష్టానానికే తెలియాలి. సాంకేతికత, సలహాదారులపై ఎక్కువగా ఆధారపడుతూ ఉండడంతో పార్టీల అధినేతలకు, క్షేత్రస్థాయిలో పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది అనడం ఎటువంటి సందేహం లేదు. కార్యకర్తలతో సమావేశమై వారిని స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే పరిస్థితి ఏ అధినేత చేయడం లేదు. కార్యకర్తను స్వేచ్ఛగా మాట్లాడనిస్తేనే కదా పార్టీ లోటుపాట్లు అధినేతకు తెలిసేది. కార్యకర్త దగ్గర తాము చేసే తప్పులను చెప్పించుకునేందుకు ఏ పార్టీ అధినేత సాహసించడం లేదు. తాము చెప్పిందే కార్యకర్తలు వినాలి అనే ధోరణితో ప్రతి పార్టీ అధినేత వ్యవహరిస్తూ ఉన్నారు. ఒకవేళ ఏ కార్యకర్త అయినా అధినేతలు చేసే తప్పులు ఎత్తిచూపితే ఆ కార్యకర్త బతుకు బస్టాండే. తన తప్పులు ఎత్తిచూపిన కార్యకర్త దశాబ్దాలు పాటూ పార్టీ కోసం కష్టపడినా పట్టించుకోకుండా వారిని డస్ట్‌బిన్‌లో వేసేసే పరిస్థితి ప్రతి పార్టీలో కనిపిస్తూ ఉంది. పార్టీల అధినేతలందరూ పార్టీ సమావేశాల్లో కూడా తమను వ్యక్తిగతంగా పొగిడించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో అష్టకష్టాలు అనుభవిస్తూ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తను మించి సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై పోస్టులు పెట్టే వారికి, ప్రత్యర్థి పార్టీల నేతలను తిట్టే వారికి, భజనపరులకు ఇటీవల అన్ని పార్టీలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉండడం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. పార్టీలు చేసే మంచి పనులను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియచేసేది. అధినేతలు ఇచ్చే అలివికాని హామీలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తీసుకుపోయేది, అధినేతలు ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ అవసరాల కోసం చేసే విమర్శలకు క్షేత్రస్థాయిలో అండగా నిలబడేది కార్యకర్తలే. అటువంటి నిజమైన కార్యకర్తలను విస్మరిస్తున్నందు వలనే తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు సుదీర్ఘ కాలం పాటు వరుసగా అధికారంలో ఉండలేకున్నాయి అనేది నిర్వివాదాంశం.

# ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్చకైనా సిద్ధం

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఒజూ), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

### ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

### హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

### ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

### విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ..

తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

# రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే.రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

# మండలిలో మాటల యుద్ధం..

- మొదటి పేజి తరువాయి

అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు.బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు.

ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో

ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

# అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- మొదటి పేజి తరువాయి

డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

## తిరుపతి లడ్డూ నెయ్యి: చంద్రబాబుపై

# భూమన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

డెయిరీ ప్రొడక్ట్స్.. టీటీడీకి కేజీ నెయ్యిని రూ. 278 నుంచి రూ. 306 ధరలకే సరఫరా చేసిందని భూమన గుర్తుచేశారు. రూ. 300 లోపు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందని ఇప్పుడు ప్రశ్నిస్తున్న చంద్రబాబు, ఆనాడు సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆశ్చర్యకరంగా, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే యూనిట్ సరఫరాదారుగా వచ్చి, ఇప్పుడు కేజీ నెయ్యిని ఏకంగా రూ. 658కి సరఫరా చేస్తోందని భూమన ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెరిటేజ్ తయారీ యూనిట్, కర్ణాటకకు చెందిన మరో సంస్థతో కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు.

గతంలో రూ. 278కి సరఫరా చేసినప్పుడు నాణ్యమైనదిగా భావించి, ఇప్పుడు ధరను రూ. 658కి ఎలా పెంచారని.. దీని వెనుక ఏదైనా వ్యాపార ఒప్పందం ఉందా అని సీఎం సమాధానం చెప్పాలని భూమన నిలదీశారు. గతంలో చంద్రబాబు హయాంలో ఈ రెండు యూనిట్లు 40 లక్షల కేజీలకు పైగా నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని భూమన డిమాండ్ చేశారు.

# కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఆయనకు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుమ్మలదిన్నెలో బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని, ఈ నెల 14న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. నోటీసులపై కాకాణి ఇంకా స్పందించాల్సి ఉంది.

మరోవైపు, నెల్లూరు జిల్లాలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో కాకాణి ఇప్పటికే జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. బెయిల్ పై బయటకు వచ్చినప్పటి నుంచి ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత పెంచారు.

# పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు.పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు. కాగా, అనుభవరాహిత్యం వల్లే పొరపాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని ఆయన కోరారు.

# 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

- మొదటి పేజి తరువాయి

సిబ్బంది అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉంచడంతో ఆయన కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని తెలిసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీం కోర్టు, వెంటనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది.

మూడు, నాలుగు నెలల క్రితం వరకు తన కుడి కన్ను చూపు సరిగ్గానే ఉందని, ఆ తర్వాత మసకగా కనిపించడం మొదలైందని న్యాయవాదితో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దాంతో పరిస్థితి విషమించి పూర్తిగా కంటిచూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని న్యాయవాదికి వివరించారు. ప్రస్తుతం తన కుడికన్ను 85 శాతం చూపు కోల్పోయినట్లు చెప్పారు.

### 'కామరూప' పిశాచి.. ఎవరీ జెఫ్రీ ఎప్‌స్టీన్?

ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో ఏకాంతంగా ఉంచడంతోపాటు ఆయనకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని, కుటుంబీకులను కూడా కలవకుండా జైలు అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కోర్టు నియమించిన అమికస్ క్యూరీ.. జైల్లో ఉన్న ఇమ్రాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను వివరిస్తూ కోర్టుకు నివేదిక సమర్పించారు. రెండున్నరేళ్లుగా ఒంటరిగా గదిలో ఉంచారని, దీంతో మానసికంగా, శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నారని అందులో పేర్కొన్నారు.

# ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

- మొదటి పేజి తరువాయి

వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు.వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి రిమాండ్

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో రిమాండ్ పడింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కేసులో గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో, 2023 జనవరిలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో బెయిల్ లభించగా, గతేడాది మెడికల్ కాలేజీ అంశంపై నిర్వహించిన ఆందోళనల్లో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న కేసులోనూ ఆయనకు బెయిల్ లభించింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ రావడంతో అంబటి విడుదల కావడం లాంఛనమేనని అందరూ అనుకున్నారు. అయితే, పోలీసులు సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ పై కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అంబటికి నిరాశే మిగిలింది. తాజా రిమాండ్‌తో ఆయన విడుదల ఆగిపోయింది.

# జాతీయస్థాయి యోగ పోటీలలో రెండు పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ కు ఎస్ పి అభినందన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**జాతీయస్థాయి యోగ పోటీలలో రెండు పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ కు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ అభినందనలు తెలిపి సన్మానించారు.

జాతీయ స్థాయిలో జరిగిన ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్, యోగా క్లస్టర్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్--2025 లో యోగాసన గ్రూప్ ఈవెంట్, యోగాసన ఆర్టిస్టిక్ ఫెయిర్ ఈవెంట్స్ నందు 2 కాంస్య పతకాలను మహిళ కానిస్టేబుల్ ఆర్. రోహిణి సాధించింది. కంట్రోల్ రూమ్ లో పనిచేసే ఈమె గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి, జాతీయ స్థాయి క్రీడలలో గెలుపొందిన పతకాలు చూపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆమెను పతకాలతో సత్కరించి, శాలువా కప్పి సన్మానించి, అభినందనలు తెలిపారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# స్వయంభుగా వెలసిన గొరబంద శివాలయాలు





పోలవరం జిల్లా, వై.రామవరం మండలం లో యార్లగడ్డ పంచాయతీ అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం గొరబంద అటవీ ప్రాంతంలో ఉంది. నాగసర్పం పడగ వలే ఉండే పెద్ద బండరాయి క్రింద స్వయంభుగా కాశీ విశ్వేశ్వర స్వామి వెలిసి దశాబ్దాలుగా పూజలు అందుకుంటున్నారని గిరిజన పూజారులు తెలిపారు. గతంలో పాండవులు అరణ్యవాసం చేసినప్పుడు రెండు కొండలు కలిసే విధంగా నిర్మాణం చేపట్టదలిచారని పూర్వీకులు తెలిపారు. ఈ నిర్మాణం తెల్లవారే సమయానికి అయిపోవాలని నిర్ణయించి పనులు ప్రారంభించారని, వీరిలో ఒక వ్యక్తి కోడివలే కూత కూయడంతో నరులు వస్తారని, తమను చూస్తారని నిర్మాణం మధ్యలో నిలిపేసి పాండవులు వెళ్లిపోయారని పూర్వీకులు కథలుగా చెబుతుంటారు. ఈ అటవీ ప్రాంతంలో శివాలయం ప్రాంగణంలో స్వయంభుగా వెలిసిన శివ లింగంపై సంవత్సరం పొడవునా చుక్క చుక్క నీటి బిందువులు పడుతూ ఉంటాయని గిరిజన పూజారులు తెలిపారు. కొత్తగా పెళ్లయిన దంపతులు ప్రక్కనే సెలయేట్లో స్నానమాచరించి మడి బట్టలతో ఆలయ ప్రాంగణంలో ఉన్న నందీశ్వరుని ఎత్తుకుంటారని తెలిపారు. అనంతరం స్వయంభు లింగం పై పడే నీటి బిందువులను చేతిలో పట్టు కొంటె సంతానం కలిగే జంటలకు పాలవలే కనిపిస్తాయని, సంతానం లేని జంటలకు నీలవలే కనిపిస్తాయని ఒక కథ నానుడిలో ఉందని పూజారులు తెలిపారు. ఈ నీటిని స్వీకరిస్తారని తెలిపారు. ఈ శివాలయములో పూజలాచరించిన భక్తులకు సంతానం కలిగితే విశ్వేశ్వర స్వామి పేరు కలిసే విధంగా నామకరం చేస్తారని తెలిపారు. గతంలో సర్పంచ్ పడగ ఆకారంలో ఉండే రాయికి పదుల సంఖ్యలో తేనె పట్లు ఉండేవని తెలిపారు. ఈ ప్రాంతంలో శివరాత్రి రోజున తెర సినిమా లు వేసేవారని, వర్షం వచ్చిన ఏ ఒక్క భక్తుడు తడిచేవాడు కాదని తెలిపారు. వై రామవరం నుండి గొరబంద గతంలో కాలినడకన వెళ్లేవారని ప్రస్తుతం వాహన సౌకర్యాలు ఉన్నాయని అన్నారు.

కృష్ణ రిపోర్టర్ వై రామవరం





## పూతి గుంట ఉబ్బలింగేశ్వర స్వామి స్వయంభూ ఆలయం



పోలవరం జిల్లా వై రామవరం మండలంలోని చవిటి దిబ్బలు పంచాయతీ పూతి గుంట గ్రామ సమీపంలో పెద్దేరు ఒడ్డున స్వయంభుగా శ్రీ ఉబ్బలింగేశ్వర స్వామి వెలిశాడని గ్రామస్తులు తెలిపారు. దశాబ్దాల క్రితం దట్టమైన అటవీ ప్రాంతంలో సర్పం, అడవి పంది నిత్యం పూజలు ఆచరించే వని పూర్వీకులు తెలిపారు. పూర్వకాలం అటవీ ప్రాంతంలో పశువులను మేపుటకు వెళ్లిన ఒక గిరిజనునికి అడవి పంది, సర్పం ఒక రాయి చుట్టూ ప్రదక్షిణలు చేయడం చూసి గ్రామస్తులకు తెలిపాడని అన్నారు. నాటి నుండి నేటి వరకు శివరాత్రి రోజున శ్రీ ఉబ్బలింగేశ్వర స్వామి నామకరణం చేసి పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శివాలయం పక్కనే పెద్దేరు వాటర్ ఫాల్స్ భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. శివాలయాల దగ్గర భక్తుల కు ఉచిత అన్నదాన సౌకర్యం ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు వేల సంఖ్యలో వచ్చి శివాలయాలను దర్శించుకుంటారని తెలిపారు. భక్తుల తాకిడి పెరగడంతో రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడం ఇబ్బందికరంగా ఉంటుందని మైదాన ప్రాంత భక్తులు అంటున్నారు.

ఈ కృష్ణ రిపోర్టర్ వై రామవరం



# కడియం మండలంలో హోమ్ స్టేలు, పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం





- నర్సరీ ఉత్పత్తుల ఎగుమతులకు సింగిల్ డెస్క్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12**


కడియం మండలాన్ని పర్యాటక, ఉద్యాన రంగాలలో తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024-29 ప్రకారం హోమ్ స్టేలను ప్రోత్సహించే దిశగా నిర్మాణాలు చేపట్టడానికి గరిష్టంగా 30 శాతం వరకు ప్రభుత్వ రాయితీ అందుబాటులో ఉంటుందని ఆమె వెల్లడించారు. గురువారం బొమ్మూరు కలెక్టరేట్‌లో కడియం మండలంలో హోమ్ స్టేల నిర్మాణం, నర్సరీ ఉత్పత్తుల విదేశీ ఎగుమతులు, పర్యాటకాభివృద్ధి తదితర అంశాలపై నర్సరీ రైతులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి చర్చించారు. కడియం నర్సరీల మొక్కలకు విదేశాలకు, రైతులు నేరుగా ఎగుమతులు చేపట్టేందుకు అవసరమైన అనుమతులు, ధృవపత్రాలు సులభంగా పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో బొమ్మూరు ఆర్‌టీఐహెచ్‌లో గాని లేదా కడియంలో గాని 'సింగిల్ డెస్క్' వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎగుమతి ప్రక్రియలను సరళీకృతం చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు ఇతర రైతులను చైతన్యపరచి, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో హోమ్ స్టేలకు మంచి డిమాండ్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అదనపు ఆదాయ వనరులను సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. కడియం నుంచి వాడపల్లి వరకు కాలువ మార్గంలో బోటు సౌకర్యాలు కల్పించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, డిహెచ్‌ఓ మల్లికార్జునరావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యప్రకాశ్, కడియం నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాజానగరం అభివృద్ధికి సహకరించాలని సీఎం కి వినతి పత్రం..



ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** సత్యసాయి డ్రింకింగ్ వాటర్ పథకాన్ని సక్రమంగా నిర్వహించేందుకు నిధుల మంజూరు చేయాలని కోరుకొండ రైతుల ఈనాం భూముల సమస్యను ఇళ్ల స్థలాలకు భూములు ఇచ్చిన వెలుగుబంధ కానవరం రైతులకు నష్టపరిహారం 2027 పుష్కరాలకు రాజానగరం నియోజకవర్గానికి ప్రాధాన్యత నిచ్చి నిధులు తగిన నిధులు కేటాయించాలిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ అయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మరోసారి రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. రాజానగరం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.




# లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి





## సిఐటియు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె
## గంగవరంలో భారీ ర్యాలీ మానవహారం

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12 :**లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం గంగవరం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వై జంక్షన్ లో మానవహారం చేపట్టి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె. రాణి అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో అంగన్వాడి, ఆశా, మిడే మీల్స్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె. రాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 మంజూరు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 గంటల పని దినాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ. 10,000గా నిర్ణయించాలని ప్రభుత్వాలను కోరారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె. కృష్ణ మాట్లాడుతూ కార్మికులకు పనికి తగిన వేతనం, పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో-కన్వీనర్ మంగ, అంగన్వాడి అధ్యక్షురాలు నాగదేవి, వివో నాగలక్ష్మి, మిడే మీల్స్ కార్యకర్తలు వీరయ్యమ్మ, శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి, వెంకాయమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

# చలమల సంరక్షణకు ప్రత్యేక చర్యలు





- ఇదిగో పెన్ పవర్ దినపత్రిక శైలిలో వార్తగా మలిచాను
- జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్,ఫిబ్రవరి 12 :** పోలవరం జిల్లాలో భూగర్భ జలాలు వృధా కాకుండా వాటిని వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా తగిన చర్యలు చేపడుతున్నామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు.గురువారం రంపచోడవరం మండలం రంప గ్రామంలోని దొర వీధిలో ఉన్న చలమలను (స్ప్రింగ్ షెడ్) ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పూర్వం గ్రామాల్లో చలమ నీటిని తాగునీటిగా ఉపయోగించేవారని, వాటిని దైవంగా భావించి దీపారాధన, పూజలు నిర్వహించేవారని చెప్పారు. కాలక్రమేణా కొన్ని ప్రాంతాల్లో చలమ నీరు తగ్గినట్లు గుర్తించామని, దీనిపై సమగ్ర పరిశీలన జరుపుతున్నామని పేర్కొన్నారు.చలమల ప్రాముఖ్యతపై ప్రస్తుత యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద స్ప్రింగ్ షెడ్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. భూగర్భ జలాలను సంరక్షించి వ్యవసాయానికి మళ్లించే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసులు పూర్వం నుండి వినియోగిస్తున్న ఈ చలమల విధానాన్ని కాపాడుకోవడం గిరిజనుల బాధ్యత అని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ టి. శ్రీనివాస్ విశ్వనాథ్, ఎంపీపీ బంధం శ్రీదేవి, ఎంపీడీవో ప్రసాద్, ఏపీవోలు బి. సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ వీరన్న, జేఈలు, ఏఈలు, పీసా కమిటీ సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెంలో బీసీవై పార్టీకి బలం - కీలక బాధ్యతల్లో కొత్త నేతలు



**పెన్ పవర్ తాడేపల్లిగూడెం ఫిబ్రవరి 12:** భారత చైతన్య యువజన పార్టీ (బీసివై) బలోపేతానికి పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ప్రకటించిన మూడవ జాబితాలో తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ప్రాధాన్యత దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి. పెంటపాడు మండలం ప్రత్తిపాడుకు చెందిన మల్లవరపు శివరామ్ ను పశ్చిమగోదావరి జిల్లా పార్టీ కో-కన్వీనర్ గా, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పెనుబోయిన హరీష్ రాఘవేంద్ర ను తాడేపల్లిగూడెం నియోజకవర్గ యూత్ కన్వీనర్ గా నియమించారు.

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేతలు మాట్లాడుతూ, పార్టీ మూడవ జాబితాలో తమకు అవకాశం కల్పించిన అధినేత బోడె రామచంద్ర యాదవ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మూడవ ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న బీసీవై పార్టీ సిద్ధాంతాలను తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తామని, యువతను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.

సామాజిక న్యాయం, యువతకు రాజకీయ అవకాశాలే ధ్యేయంగా ఏర్పడిన బీసీవై పార్టీ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని నియోజకవర్గ యూత్ కన్వీనర్ పెనుబోయిన హరీష్ రాఘవేంద్ర పేర్కొన్నారు.

## ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కరువు సామాజిక తనిఖీ గ్రామ సభలో కూలీల ఆవేదన



**కాట్రేనికోన పెన్ పవర్ ఫిబ్రవరి 12:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ విమర్శలకు దారితీస్తోంది. కాట్రేనికోన గ్రామ సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఉపాధి పనులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సభ జరుగుతున్నట్లు ఎవరికీ తెలియదని అన్నారు. పనుల్లో జవాబుదారీతనం, పారదర్శకత కరువైందన్నారు. ఉపాధి పనులు చేసే ప్రదేశాలలో కనీసం మంచినీరు సౌకర్యం కల్పించడం లేదని, నీడ లేదని,ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స సౌకర్యాలు కూడా లేవని ఉపాధి కూలీల ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మండల స్థాయి ఉపాధి సిబ్బంది కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించే వారని ప్రస్తుతం నిర్లక్ష్యంగా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. గ్రామసభను మొక్కుబడి తంతు గా నిర్వహించారని స్థానికులు ఆరోపించారు. ఈ సామాజిక తనిఖీ గ్రామ సభలో కొందరు ఉపాధి కూలీలు తప్ప, స్థానిక గ్రామ ప్రజలు లేకపోవడం పట్ల నిరసన వ్యక్తంమైంది.పంచాయతీ కార్యదర్శి జె వి వి సత్యనారాయణ, మండల ఉపాధి ఏపీవో చంద్రమోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్తు విద్యుత్ వాహనాలదే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శ్రీ ఫణికృష్ణ





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, ఫిబ్రవరి 12..** భవిష్యత్తు విద్యుత్ వాహనాలదేనని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీ ఫణి కృష్ణ కర్రి సూచించారు. ఏపీ నిట్ లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్టీ లెవెల్ ఇన్వర్టర్ ఫెడ్ మల్టీఫేజ్ ఎలక్ట్రానిక్ మోటార్ డ్రైవ్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్స్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. భారత ప్రభుత్వ ఆధీనంలోని అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏ.ఎన్.ఆర్.ఎఫ్) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆచార్యులు, డాక్టర్ తేజావతు రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ శ్రీ ఫణి కృష్ణ కర్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యుత్ వాహనాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. మరో ముఖ్య అతిథి ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ ప్రభుత్వాలు సహజ ఇంధన వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను రాయితీలతో ప్రోత్సహిస్తూ ఉండటంతో వీటి కొనుగోళ్లు రోజురోజుకు పెరుగుతున్నాయని చెప్పారు. ఆచార్యులు పెద్దపాటి శంకర్ మాట్లాడుతూ విద్యుత్ వాహనాలపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్యులు తేజావతు రమేష్ మాట్లాడుతూ భోదనాపరంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇటువంటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్తులో మరిన్ని ఎఫ్.డి.పిలు. నిర్వహిస్తామని తెలిపారు. భారీ వాహనాల్లో మల్టీ ఫేజ్ మోటార్లను వినియోగించటం ద్వారా ఒక ఫేజ్ పనిచేయకపోయిన మిగిలినవి సమర్థవంతంగా పనిచేస్తాయని వివరించారు. అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రా యూనివర్సిటీ, వాసవి, శశి, విష్ణు, విట్, విఆర్ సిద్దార్థ, స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు హాజయ్యారు.

## ఉంగుటూరులో సీఐటీయూ సమ్మె ఘన విజయం

- నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్




**పెన్ పవర్ ఉంగుటూరు, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉంగుటూరు మండలంలో సీఐటీయూ (జ×ుఖ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె విజయవంతంగా సాగింది. ఈ సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏలు, వివిధ ఫ్యాక్టరీల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దళిత ఎమ్మార్వో కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ ఉంగుటూరు హైవే వరకు సాగి అక్కడ బహిరంగ సభగా కొనసాగింది. ఈ సభకు సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్. అప్పారావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందని తీవ్రంగా విమర్శించారు. దేశంలోని పరిశ్రమ రంగంలో అశాంతి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కే. కమల్ కుమార్ పాల్గొని సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. అలాగే భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు బుర్రె వినోద్ కుమార్, సీఐటీయూ మండల నాయకులు సుజాత, లిల్లీ కుమారి, ఆశా యూనియన్ మండల నాయకురాలు అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు జిల్లా యంత్రాంగం బాసట

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇంటి పట్టా మంజూరు
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, ఫిబ్రవరి 12 ,పెన్ పవర్:** పిఠాపురం నియోజకవర్గం మాదాపూర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు చిన్నారులకు సహాయం అందించేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల అనాథలైన చిన్నారులు గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉదారతతో ప్రతి నెలా రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు.చిన్నారులు ధైర్యంగా ఉండాలని సూచించారు.వారికి శాశ్వత నివాసం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం వెంటనే ఇంటి పట్టా మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.పిల్లల విద్యాభ్యాసా నికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించబడతాయని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో గోపాలకృష్ణ చేతుల మీదుగా చిన్నారులు కరణం సత్య, చంటి లకు ఇంటి పట్టాను అందజేశారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం ఎంపీడీవో కే.స్వప్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ఎన్నికలు

**అమలాపురంలో సర్వం సిద్ధం**

**– ఎన్నికల అధికారి చింతపల్లి అజయ్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రెండోసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 13 న రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి.

?పోటీలో 143 మంది అభ్యర్థులు

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 23 బార్ కౌన్సిల్ సభ్యత్వ స్థానాల కోసం 143 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అమలాపురం బార్ అసోసియేషన్ నందు నేడు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎన్నికల అధికారి చింతపల్లి అజయ్ కుమార్ తెలిపారు. అమలాపురం బార్ అసోసియేషన్‌లో మొత్తం 306 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఓటు వేసే ప్రతి ఒక్కరూ కనీసం 5 ఓట్లను, గరిష్టంగా 23 ఓట్లను వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. న్యాయవాదులందరూ ఎన్నికల నియమావళిని పాటిస్తూ, క్రమశిక్షణతో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## నగరం లో అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. తొలుత ఐ.ఎల్.టి.డి. ఫ్లైఓవర్ వద్ద రైల్వే బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించి.. పనుల పురోగతిని అడిగి తెలుసు కున్నారు. అనంతరం 17వ వార్డు అంబికా నగర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన చిన్నారుల ఆట పరికరాలు పరిశీలించారు. పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దే దిశగా చొరవ చూపాలని అధికారులకు సూచించారు. 25వ వార్డు ధాన్యంపాకల వీధిలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన పనులు సకాలంలో పూర్తిచేయవలసిందిగా ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా వెనువెంటనే రిస్టోరేషన్ పనులు చేపట్టాలన్నారు. పర్యటనలో ఎంహెచ్ఓ వినూత్న, ఈఈ మాధవి, డీఈ సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీమంత్రి జోగి రమేష్ ను పరామర్శించిన తాడేపల్లిగూడెం నియోజకవర్గ వడ్డి రఘురామ్





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 12.** ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ ను తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఇటీవల జోగి రమేష్ ఇంటిపై పలువురు దుండగులు దాడి చేయడం విదితమే. ఈ సందర్భంగా జోగి రమేష్ ను పరామర్శించారు. వారికి సంఘీభావంగా సంఘీభావంగా తాడేపల్లిగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నుండి 15 కార్లలో పెద్ద ఎత్తున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో జోగి రమేష్ నివాసానికి వెళ్లి వారికి వారిని పరామర్శించి, వారికి సానుభూతి తెలియచేసారు. దాడి సంఘటన ఎలా జరిగింది అని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీ వెంట మెమెప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, పెంటపాడు మండల వైసీపీ అధ్యక్షుడు కైకాల శ్రీనివాస్, ఎంపీటీసీలు మార్లపూడి సుబ్బారావు, వెంకన్న, వైసీపీ నాయకులు మాకరాజు సతీష్, వింజమూరి శ్రీనివాస్, కాకర్ల శ్రీనివాస్, కలిశెట్టి తాతారావు, కునుకు పుల్లయ్య, మానుకొండ వెంకటేశ్వరరావు, మారిశెట్టి మురళి, నాగభూషణం, అర్జున్ రావు, వెంకటేశ్వరరావు, దత్తసాయి తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని నిరసన ప్రదర్శన

**లేబర్ కోడ్ లు కార్మికుల పాలిట గొడ్డలి పెట్టు : ఐఎన్టియుసిఅధ్యక్షుడు-వాసంశెట్టి గంగాధర్**



**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఫిబ్రవరి 12:** దేశంలో కార్మిక వ్యతిరేక విధానాల్లో భాగంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వాసంశెట్టి ఆధ్వర్యంలో స్థానిక కోట గుమ్మం వద్ద ఐ ఎన్ టి యు సి అనుబంధ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా మారి కార్మికులను ఇబ్బందులు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు 1926 లో పోరాడి అమల్లోకి తెచ్చుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చడం దారుణమని ధ్వజమెత్తారు. ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 12 గంటలకు మార్చి కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా 12 లక్షల కోట్ల రుణమాఫీ చేసి వారికి అండగా నిలబడిన మోడీ కార్మికులపై కక్ష కట్టడం తగదన్నారు. దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొని ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు పాలన సాగించలేవని దేశంలో ఆ పరిస్థితి రావడం ఖాయమని హెచ్చరించారు. ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి టి. నారాయణరావు, ఆటో వర్కర్స్ యూనియన్, క్వారీ లారీ వర్కర్స్ యూనియన్, సదరన్ డ్రగ్స్ యూనియన్, కడియం కోస్టల్ పేపర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు. కోస్టల్ పేపర్ మిల్లు స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సాయిబాబా మాట్లాడుతూ 2017 నుంచి తమకు జీతభత్యాలు పెంచలేదని, కనీస వేతనం 24 వేల రూపాయలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై కార్మిక శాఖ అధికారుల కార్యాలయల ఎదుట ఆందోళన చేపట్టినట్లు తెలిపారు.

# భక్తులకు ఇబ్బంది లేకుండా పటిష్ట ఏర్పాట్లు



మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని ప్రముఖ ఘాట్ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నుండి అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బందితో మహాశివరాత్రి ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఘాట్లలో విధులు నిర్వహించు సిబ్బందికి శిక్షణ ఇవ్వవలసిందిగా ఆయా విభాగాల అధికారులకు సూచించారు. ప్రతిఒక్క ఉద్యోగి శుక్రవారం జరుగు మాక్ డ్రిల్ కు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు, జల్లు స్నాన ఏర్పాట్లు, దుస్తులు మార్చుకొను గదులు, టాయిలెట్లు, వాహనాల పార్కింగ్, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్లో లైటింగ్ ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రతి ఘాట్ కు ప్రవేశ మార్గం, వెలుపలకు వచ్చు మార్గం వేరువేరుగా ఉండాలని, పారిశుధ్యం లో లోటుపాట్లు ఉండకూడదన్నారు. శానిటేషన్ వర్కర్లు తప్పనిసరిగా అప్రాన్ లు ధరించాలన్నారు. ప్రతి ఘాట్ లోనూ మెడికల్ క్యాంపు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఘాట్ల వద్ద డుస్, డునాట్ బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా కూడా భక్తులను అప్రమత్తం చేయాలని కమిషనర్ తెలిపారు. కేటాయించిన ప్రదేశాలలోనే పిండప్రదానాలు చేసుకోవాలని , నదీలో పుణ్యస్నానాలు ఆచరించు భక్తులు సబ్బులు, షాంపులు వినియోగించకూడదన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఘాట్లకు చేరు ప్రధాన, ఇతర రహదారులపై టెంట్లు ఏర్పాటు చేయకుండా చూడాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అన్నదానాలు చేయాలనుకునే దాతలు స్థానిక వార్డు సచివాలయాలను సంప్రదించినట్లయితే.. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా స్థలాన్ని చూపడం జరుగుతుందన్నారు. అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా స్పష్టమైన రూట్ మ్యాప్ ను సిద్ధం చేయవలసిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అంబులెన్సులను సమీప హాస్పిటల్ కు మ్యాప్ చేయడం ద్వారా మెడికల్ ఎమర్జెన్సీ సమయంలో ప్రాణనష్టం వాటిల్లకుండా కాపాడవచ్చున్నారు.

రానున్న గోదావరి పుష్కరాలకు ట్రయిల్ రన్ లాగా మహాశివరాత్రికి టెక్నాలజీని వినియోగించబోతున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా వారి చేతికి డిజిటల్ ట్యాగ్ ను వేసి,ఆ ట్యాగ్ ను కుటుంబ సభ్యుల మొబైల్ ఫోన్ కు యాప్ ద్వారా జతపరచడం జరుగుతుందన్నారు. తప్పిపోయిన చిన్నారులను ట్రాక్ చేయడం సులభతరం అవుతుందని వెల్లడించారు. గత అనుభవాల దృష్ట్యా.. అనధికారిక రేవులలో పుణ్యస్నానాలు ఆచరించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘాట్ లలోనే పుణ్యస్నానాలు ఆచరించాలన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేసినట్లు, ప్రతిబోటు వద్ద లైఫ్ జాకెట్లు తప్పనిసరి అని ఆదేశించారు. జాగరణ చేయు భక్తుల కోసం సుబ్రహ్మణ్య మైదానం నందు 14, 15 తేదీలలో వరుసగా సినిమాలు ప్రదర్శించవలసిందిగా సూచించారు. మహాశివరాత్రి ముగిసే వరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఐక్య పోరాటాల ద్వారా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోవాలి.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 12:** ఐక్య పోరాటాల ద్వారా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోడానికి వీధి పోరాటాలకు వెనుకాడమని తాడేపల్లిగూడెం సిపిఐ కార్యదర్శి మండల నాగేశ్వరరావు హెచ్చరించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం కె.ఎన్.గ్రౌండ్సొలో కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల అధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్లకు దోసిపెడుతూనే ఉందని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్, బ్యాంకులు, విశాఖ స్టీలు, రైల్వే, ఎల్ఐసి తదిత సంస్థల్లో ప్రైవేటీకరణ విధానాలు ప్రారంభించిందని ఈ విధానాలు ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్లు మరింత దోచుకునే విధంగా 29 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు అమలులోకి తెచ్చిందని కార్మికులకు ఉద్యోగులకు తీవ్ర నష్టం చేసిందన్నారు కార్మికులకు పని గంటల హక్కు ట్రేడ్ యూనియన్ పెట్టుకుని హక్కు పని భద్రత హక్కులు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికయినా మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బహిరంగ సభ అనంతరం కార్మికులు మార్కెట్ సెంటర్, అంబెడ్కర్ కూడలి, ఓవర్ బ్రిడ్జి మీదుగా బస్ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పూడి వెంకట్రావు, వద్దాది మేరీ, నాగరాజు నాగలక్ష్మి, ఎం.స్వర్ణకుమారి, ఎన్.సీత తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించిన తాడేపల్లిగూడెం నియోజకవర్గ వడ్డి రఘురామ్





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 12.** గుంటూరులో మాజీమంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు పరామర్శించారు. ఇటీవల అంబటి రాంబాబు ఇంటిమీద పలువురు దుండగులు ఉద్దేశపూర్వకంగా దాడి చేశారు. ఈ దాడిని ఖండిస్తూ వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుండి వైఎస్సార్ సీపీ శ్రేణులు 15 కార్లలో వెళ్లి పరామర్శించారు. అంబటి రాంబాబు గారు అందుబాటులో లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. దాడి సంఘటన ఎలా జరిగింది అని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీ వెంట మెమెప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, పెంటపాడు మండల వైసీపీ అధ్యక్షుడు కైకాల శ్రీనివాస్, ఎంపీటీసీలు మార్లపూడి సుబ్బారావు, వెంకన్న, వైసీపీ నాయకులు మాకరాజు సతీష్, వింజమూరి శ్రీనివాస్, కాకర్ల శ్రీనివాస్, కలిశెట్టి తాతారావు, కునుకు పుల్లయ్య, మానుకొండ వెంకటేశ్వరరావు, మారిశెట్టి మురళి, నాగభూషణం, అర్జున్ రావు, వెంకటేశ్వరరావు, దత్తసాయి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాకు చిక్కిన దొంగ..

- 92 గ్రాముల బంగారం వస్తువులు లక్ష నగదు చోరీ..
- శ్రీరంగపట్నం మద్దాల రమణ ఇంటిలో చోరీ చేసిన జగత్, అనిల్ కుమార్ ..
- దొంగలను 24 గంటల్లో అరెస్టు చేసిన కోరుకొండ పోలీస్ సిబ్బంది..



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** సీసీ కెమెరాకు చిక్కిన దొంగలను అరెస్టు చేసిన కోరుకొండ పోలీస్ సిబ్బంది. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన మద్దాల రమణ ఇంట్లో 92 గ్రాములు బంగారం వస్తువులు మరియు లక్ష రూపాయలు నగదు చోరీ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం కోరుకొండ పోలీస్ స్టేషన్ లో డీఎస్పీవై శ్రీకాంత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ దొంగతనం ఆయన దగ్గర కారు డ్రైవర్ గత కొంతకాలంగా పనిచేస్తున్నటువంటి శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన శరకణం జగత్ (కొండలరావు) మరియు దండు అనిల్ కుమార్ లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి చోరీ కాపాడిన దొంగ సొత్తును రికవరీ చేసి వారిని రిమైండ్ నిమిత్తం కోర్టుకు వారి ముందు హాజరు పరుస్తారని కోరుకొండ డీఎస్పీ శ్రీకాంత్ తెలియపరిచారు. ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేయడంలో సీసీ కెమెరాలు బాగా ఉపయోగపడినవని తెలిపారు. దొంగలను 24 గంటల్లోపే అరెస్టు చేసి దర్యాప్తు అధికారి కోరుకొండల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి వి ఎస్ మూర్తిని మరియు దర్యాప్తుకు సహకరించిన కోరుకొండ ఎస్సై శ్రీనివాస్ మరియు సత్తిరెడ్డి, గోవింద్, పైడి నాయుడు, మరియు రామచంద్ర లను జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్, డి.ఎస్.పి వై శ్రీకాంత్ అభినందించారు.

# లేబర్ కోడ్లు రద్దు చేయాలి -- సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ప్రజాసంఘాల కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు కార్మికులు నినాదాలతో ర్యాలీ చేపట్టారు.అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంభం శాంతిరాజు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎనిమిది గంటల పని సమయాన్ని 10 నుండి 12 గంటలకు పెంచడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం చట్టం ప్రకారం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం చేయాలని, ప్రభుత్వం మద్దతు ధరకు పంట కొనుగోలు చేయాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర నిధులు తగ్గించడం వల్ల రాష్ట్రంపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ శానిటేషన్ కార్మికులు, వెలుగు యానిమేటర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పోటీకి సత్యనారాయణ మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. లేబర్ కోడ్ల ద్వారా కార్మిక సంఘాల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. మహిళా కార్మికులను రాత్రి వేళల్లో పని చేయించడాన్ని ఖండించారు.న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు దూలయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. పి.ఓ.డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి అనసూయ మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంభం శాంతిరాజు, మండల కన్వీనర్ తీగల శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు సాదల విద్యాసాగర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు కారం రామలక్ష్మి, కొమరం మంగాయమ్మ, జి. బేబీరాణి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కలింకోట రమణమ్మ, వెలుగు యానిమేటర్స్ జిల్లా కార్యదర్శి అరగాటి రామకృష్ణ, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు జోగారావు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు లచ్చిరెడ్డి, సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్, ఆదివాసి పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మద్దిటి అంజిరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడ్డతీగలలో కార్మిక దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం. భారీగా పాల్గొన్న కార్మికులు..





**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** మండల కేంద్రమైన అడ్డతీగల లో కార్మికసార్వత్రిక సమ్మె విజయవంతం అయింది.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, సిఐటియు పోలవరం జిల్లా సహాయ కార్యదర్శి పి. రామరాజు ఆధ్వర్యంలో అడ్డతీగల మండల కేంద్రంలో గురువారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది.సమ్మె నేపథ్యంలో కార్మికులు ఎర్రజెండాలతో కదం తొక్కారు.స్థానిక సీతపల్లి సెంటర్ భారీ ఎత్తున కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అడ్డతీగల దేవి సెంటర్ లో మానవహారం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలపై బిగ్గరగా నినదించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.రామరాజు మాట్లాడుతూ,ఏదైతే కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దుచేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పాత చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి వారు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మారకపోతే భవిష్యత్తులో కార్మికులను మరింత ఐక్యతచేసి పోరాటాలు ఉధృతం చేస్తామని రామరాజుహెచ్చరించారు. అలాగే సివిల్ సప్లై హమాలీలు సివిల్ సప్లై గోదాము వద్ద నిరసన తెలియజేశారు. హమాలి యూనియన్ ఏ ఐ టి యు సి నాయకులు ఏ రాజు బాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలను ఖండిస్తూ దేశంలో కార్మికులు సమ్మెకు దిగారని కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను తిరిగి అమలుకు ప్రయత్నించాలని రాజబాబు కోరారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు,అంగన్వాడి, ఆశ,మిడ్ డే మీల్స్, భవన నిర్మాణం,వివోఏ, హమాలి,మెడికల్ అండ్ హెల్త్,పలు కార్మిక సంఘాల నాయకులు, లక్ష్మి,పార్వతి,చంద్రకళ, రాఘవ,జి సురేష్, ఆదినారాయణ,పెదకాపు,చందు,రాజబాబు, సూరమ్మ,సత్యవతి, దుర్గారావు,లింగామణి, గౌరీ,ఆదిలక్ష్మి,నూక రత్నం,రాజులమ్మ, కార్యకర్తలు అసంఘటితరంగా కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతున్నది.

ఎమ్మెల్యే మద్దిపాటి.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 12.** రాష్ట్రంలో అభివృద్ధి దూసుకుపోతున్నదని దానికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలేనని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు కొనియాడారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి ఎమ్మెల్యే మద్దిపాటి ధన్యవాదాలు తెలుపుతూ శాసనసభలో అధికారికంగా ధన్యవాద తీర్మానాన్ని గురువారం ప్రవేశపెట్టారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రంలో జరిగిన జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రసంగించవలసి ఉంది. అలా ప్రసంగించిన దానిపై ఎమ్మెల్యే వెంకటరాజు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధి కనిపించిందన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో ప్రవేశపెట్టిన సంస్కరణలను వివరించారన్నారు. అలాగే గ్రామీణ అభివృద్ధి పై ప్రభుత్వం చేపడుతున్న పనులను ప్రశంసించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల యొక్క ఆశలను నెరవేర్చే విధంగా ఉన్నాయని కొనియాడారు. ధన్యవాదాలు తీర్మానంపై చర్చి సందర్భంగా సభలోని సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అయితే ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు మద్దతుగా సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమం, పాలనలో పారదర్శకత, లక్ష్యాలను అధిగమించడం వంటి కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. శాసనసభ ద్వారా ప్రజల ఆశయాలు సాకారం కావాలని ఎమ్మెల్యే మద్దిపాటి ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తరఫున గవర్నర్ ప్రసంగాన్ని తీర్మానం చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి...



- సిఐటియు డిమాండ్
- ఉపాధి హామీ పథకం పాత పద్ధతిని కొనసాగించాలి

**కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 12.**దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మండలంలోని అన్ని రంగాల కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సుమారు 300 మంది కార్మికులతో స్థానిక సాయిబాబా మందిరం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.సిఐటియు కో కన్వీనర్ కొమరం రామకృష్ణ అధ్యక్షతన బస్టాండ్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. సిఐటియు కన్వీనర్ పాయం సీతారామయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేసారు.అన్ని రంగాల కార్మికులందరికి కనీస వేతనం 26 వేలు చెల్లించాలని అన్నారు.ఉపాధి హామీ పథకంలో పాత పద్దతిని కొనసాగించాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు.అన్ని రంగాల కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెత్తనం వహిస్తున్నాయని ఈ రకమైన ధోరణి విడ నాడాలని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని,కౌలు రైతులకు పంట రుణాలు,పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు.విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థ నుండి ప్రైవేటికరణ చెయ్యొద్దని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాబు బొర్రయ్య, రైతుసంఘం నాయకులు మేకల నాగేశ్వరావు,సర్పంచులు నాగమణి,శంకర్, రామారావు, ఎంపీటీసీ లు అమ్మాజి,జయసుధ, సీఐటీయూ నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు,మరియు అన్ని రంగాల నాయకులు ఆశా నాయకులు లక్ష్మి ప్రసన్న, విఓఏ నాయకులు మణి,మహేష్, భద్రమ్మ,శానిటైజర్ బుచ్చమ్మ, సీత,కామేష్,గ్రామ పంచాయితీ వర్కర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టిసీమ ఉత్సవాలకు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి-అడిషనల్ ఎస్పీ చెంచు రెడ్డి

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**ఎంతో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పట్టిసీమ భద్రకాళి సమేత విశ్వేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ చెంచు రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నాడు సీతానగరం మండలంలోని వంగలపూడి ర్యాంపు నుండి మహాశివరాత్రికి వెళ్లే భక్తులకు ప్రధానంగా భద్రత రవాణా లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు. గోదావరి మధ్యలో వెలసిన విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు సక్రమంగా పూర్తి చేయాలని భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రవాణా సౌకర్యాలు పడవ ప్రయాణాల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని త్రాగునీరు వైద్య శిబిరం నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని చెప్పారు. ఉత్సవాలు విజయవంతం కావాలంటే పోలీస్ రెవెన్యూ దేవాదాయ ఆరోగ్య విద్యుత్ శాఖ మధ్య పూర్తిస్థాయి సమన్వయం ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ డిఎస్పి వై. శ్రీకాంత్, కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి.వి. ఎస్ మూర్తి, ఎస్సై డి. రామ్ కుమార్, కొంచెం చంద్ర భాస్కరరావు , మండల తాసిల్దార్ అంకం శ్రీనివాస్, ఎంపీడీవో యం. భారతి, సీతానగరం సొసైటీ చైర్మన్ మట్టా వెంకటేశ్వరరావు, తదితర పాల్గొన్నారు.



## అడ్డతీగలలో కార్మిక దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం. భారీగా పాల్గొన్న కార్మికులు..





**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** మండల కేంద్రమైన అడ్డతీగల లో కార్మికసార్వత్రిక సమ్మె విజయవంతం అయింది.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, సిఐటియు పోలవరం జిల్లా సహాయ కార్యదర్శి పి. రామరాజు ఆధ్వర్యంలో అడ్డతీగల మండల కేంద్రంలో గురువారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది.సమ్మె నేపథ్యంలో కార్మికులు ఎర్రజెండాలతో కదం తొక్కారు.స్థానిక సీతపల్లి సెంటర్ భారీ ఎత్తున కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అడ్డతీగల దేవి సెంటర్ లో మానవహారం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలపై బిగ్గరగా నినదించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.రామరాజు మాట్లాడుతూ,ఏదైతే కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దుచేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పాత చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి వారు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మారకపోతే భవిష్యత్తులో కార్మికులను మరింత ఐక్యతచేసి పోరాటాలు ఉధృతం చేస్తామని రామరాజుహెచ్చరించారు. అలాగే సివిల్ సప్లై హమాలీలు సివిల్ సప్లై గోదాము వద్ద నిరసన తెలియజేశారు. హమాలి యూనియన్ ఏ ఐ టి యు సి నాయకులు ఏ రాజు బాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలను ఖండిస్తూ దేశంలో కార్మికులు సమ్మెకు దిగారని కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను తిరిగి అమలుకు ప్రయత్నించాలని రాజబాబు కోరారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు,అంగన్వాడి, ఆశ,మిడ్ డే మీల్స్, భవన నిర్మాణం,వివోఏ, హమాలి,మెడికల్ అండ్ హెల్త్,పలు కార్మిక సంఘాల నాయకులు, లక్ష్మి,పార్వతి,చంద్రకళ, రాఘవ,జి సురేష్, ఆదినారాయణ,పెదకాపు,చందు,రాజబాబు, సూరమ్మ,సత్యవతి, దుర్గారావు,లింగామణి, గౌరీ,ఆదిలక్ష్మి,నూక రత్నం,రాజులమ్మ, కార్యకర్తలు అసంఘటితరంగా కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కందుకూరి" చరిత్ర భవిష్యత్తు తరాలకు తెలియాలి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు సమాజానికి చేసిన సేవ ఆయన చరిత్ర ముందు తరాలకు తెలియాల్సి అవసరం ఎంతైనా ఉందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రూ. 30 లక్షలతో వవంకాయల వారి వీధిలోని కందుకూరి వీరేశలింగం పంతులు స్వగృహానికి చేపట్టిన ఆధునీకరణ పనులను ఆయన జనసేన పార్టీ రాజమండ్రి ఇంచార్జ్ అత్తి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు స్వగృహం శిథిలావస్థలో ఉందని, గత ఐదేళ్ల వైకాపా పాలనలో విస్మరించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చారిత్రక ఆస్తిని పునరుద్ధరించేందుకు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సహకారంతో రూ. 30 లక్షల మంజూరు చేసి, మరమ్మత్తు పనులు ప్రారంభిం చామన్నారు.కందుకూరి వీరేశలింగం పంతులు బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలను ఈ ఇంటిలోనే 1881 డిసెంబర్ 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించారని గుర్తు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం 1893లో ఆయనకు 'రావు బహదూర్' బిరుదు ప్రదానం చేసిందన్నారు. సమాజహితం కోరుతూ తన యావదాస్తిని దానం చేసిన కందుకూరి రచనలు, బట్టలు, కుర్చీ, మఫ్లర్‌లు ఇక్కడ భద్రంగా ఉన్నాయని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు.

గత ఐదేళ్లు వైకాపా కందుకూరి ఆస్తులను నిర్లక్ష్యంగా వదిలేసిందని మండిపడ్డారు. ఆయన విద్యాసంస్థల్లో ఆశాస్త్రీయంగా కొన్నింటిని దేవాదాయ, విద్యా శాఖలోకి కలిపిందని, మరికొన్నింటిని గాలికి వదిలేవడం వల్ల వాటి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని వాపోయారు. ఎంపీ పురంధేశ్వరి నిధుల నుంచి రూ కాంపౌండ్ వాల్, టాయిలెట్లు, టేక్‌వుడ్ బీమ్స్, ఫ్యాన్ టైల్స్‌తో మరమ్మత్తు పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ. 50 లక్షలతో పూర్తి చేసి, భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం టౌన్ హాల్ కు మరమ్మతులు చేపట్టి , లైబ్రరీని, కళకారుల వేదికను అందుబాటులో ఉంచమన్నారు.

ప్రజలు, విద్యార్థులు, ఈ చారిత్రక స్థలాన్ని సందర్శించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పురావస్తు శాఖ, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## నాణేల శివలింగం రూపశిల్పిసాయి తేజ సన్మానించిన వైసీపీ నాయకులు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 12.** మండలంలోని కొవ్వూరు పాడు గ్రామానికి చెందిన చిలక సాయి తేజ రూపాయల నాణేలతో శివలింగాన్ని తయారు చేశాడు. సుమారు లక్ష 25 వేల రూపాయల నాణేలను ఈ శివలింగాన్ని తయారు చేయడానికి ఉపయోగించాడు. అసలే శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో ఈ శివలింగానికి భక్తుల నుండి అత్యంత ఆదరణ లభించింది. ప్రజల దర్శనార్థమై శివలింగాన్ని ఉంచారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తానేటి వనిత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి ల ఆధ్వర్యంలో గురువారం కొవ్వూరుపాడు వెళ్లి శివలింగాన్ని సందర్శించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాణెములతో తయారుచేసిన శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కర్పూరమైన దీక్షతో ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ఈ మహోన్నతమైన అరుదైన శివలింగాన్ని తయారుచేసిన సాయి తేజను ఘనంగా సన్మానించారు. ఈ మారుమూల గ్రామంలో పుట్టిన సాయి తేజ శివుడు పై తనకున్న భక్తిని చాటుతూ ఈ శివలింగాన్ని తయారు చేయడం ఆనందించదగ్గ విషయమని కొనియాడారు. ఇటువంటి వారిని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని వనిత అన్నారు. శివరాత్రి రోజు ఈ శివలింగాన్ని పట్టిసీమ పుణ్యక్షేత్రం వద్ద ఉంచనున్నట్లు సాయి తేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలక లక్ష్మణస్వామి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూసం రామ్మోహన్ రెడ్డి, సాలి వేణు, కాకులుపాటి శ్రీను, ఎస్.కె మస్తాన్, హరిబాబు, గెల్లా శ్రీను తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ు

## సార్వత్రిక సమ్మెతో దగ్గరిల్లిన గండేపల్లి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం......



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,12:**గండేపల్లి సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ మండల అధ్యక్షులు వై.శ్రీనివాసరెడ్డి.కార్యదర్శి నొక్కులలిత ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యలయం వద్ద సమ్మె నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్ కి డిమాండ్స్ నోటీస్ అందించారు కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని. కనిసవేతనం 26000 చెల్లించాలని స్కీం వర్కర్స్ ఐన అంగన్వాడీ .ఆశా . మిడ్ డే మీల్స్ తదితర పథకాలు లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని.. 12గంటలు పని విధానాన్ని రద్దుచేయాలని. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ పెంచాలని .రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని.కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని .సమనపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ .సమ్మె నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సమ్మెలో భవన నిర్మాణ రంగం..అంగన్వాడీ ఆశా. నుండి వై వి రాజేశ్వరి..జ్యోతి.. వై వెంకటలక్ష్మి,శాంతి.విష్ణులక్ష్మి. మహేష్ .శ్రీను ..తాళ్లూరు..మల్లెపల్లి గ్రామలనుండి బిల్డింగ్ రంగాలభవన నిర్మాణం కార్మికులు తాళ్లూరు.వీరబాబు లక్ష్మీ చౌదరి
మల్లేపల్లి శ్రీను గారు వెంకన్నగారు
నీలాద్రిరావు పేట నారాయణదాసు శ్రీను . ప్రెసిడెంట్ సెక్రటరీ లు నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు...ఈ సమ్మెకు మద్దతుగా యూ టి ఎఫ్ నుండి రమణ ఉన్నారు

## డా. అడ్డాల సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందదాయకం: డా. వాడ్రేవు రవి




**కాకినాడ పెన్ పవర్, ఫిబ్రవరి 12:**కాకినాడలోని ఓ స్థానిక హోటల్‌లో ఏవన్ డయాగ్నోస్టిక్స్ అధినేత డా. వాడ్రేవు రవి అధ్యక్షతన, రేడియాలజిస్ట్ డా. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దంత వైద్యులకు సీబీసీటీ స్కాన్‌పై విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. వాడ్రేవు రవి మాట్లాడుతూ, గత రెండున్నర దశాబ్దాలుగా కాకినాడలో విశిష్ట సేవలు అందిస్తున్న డా. అడ్డాల సత్యనారాయణకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందదాయకమన్నారు. వైద్యులు తమ వృత్తి సేవలతో పాటు కొంత సమయాన్ని సమాజ సేవకు కేటాయించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో వైద్యులు వెన్నెముక వంటివారని, వారి సేవలను గౌరవించడం మరియు రక్షించడం మనందరి బాధ్యత అని తెలిపారు. డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, “వైద్యో నారాయణో హరిః” అన్న సూత్రం ప్రకారం వైద్యుల సేవలు అసమానమైనవని పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడే వైద్యుడిని దేవుడితో సమానంగా భావించే సంస్కృతి మనదని అన్నారు. తనకు లభించిన జాతీయ పురస్కారం కాకినాడ శాఖ దంత వైద్యుల సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు. డా. వి.వి.రావు ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డా. హర్ష, డా. నాగేంద్ర, డా. రఘురామ్, డా. కృష్ణంరాజు, డా. చైతన్య, డా. వల్లి, డా. సిరాజ్, డా. ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ లక్కొండలో సచివాలయ పనులపై డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర సమీక్ష





**గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 12:**గురువారం గంగవరం మండలంలోని స్వర్ణ లక్కొండ గ్రామాన్ని డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, రికార్డులు అన్నీ సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టంగా సూచించారు. అదేవిధంగా యు ఎస్ ఎఫ్,పి4, ఈ కేవైసీ సర్వేలను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాన్ని కూడా ఆయన పరిశీలించారు. నిర్మాణ పురోగతిపై వివరాలు సేకరించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. తదనంతరం గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. పిల్లల హాజరు, బోధన ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## శుద్ధజలం వట్టి మాటేనా..?





**-తాగునీటి చెరువుల శుభ్రతపై నిర్లక్ష్యం**

**ఏలూరు పిబ్రవరి 12 పెన్ పవర్** :దెందులూరు మండలం కొవ్వలి గ్రామ పంచాయితీ కి ఆదాయం బాగున్నా గ్రామంలో ప్రగతి కనిపించడం లేదు. గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే మంచినీటి చెరువు అపరిశుభ్రత నెలకొని ఉన్నా పంచాయితీ సిబ్బంది శుభ్రపరచడం లేదు. తాగునీటి చెరువు తూడు,పిచ్చిమొక్కలతో కమ్మేసింది. చెరువులోని పూడికను తొలగించకుండా, అపరిశుభ్రతతో కూడిన తాగునీటిని తాగునీటితో ట్యాంకులను నింపి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఈ కలుషిత నీటిని తాగలేమంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో గ్రామంలో 6వేల మంది ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్ధకంగా మారింది.

తాగునీటి సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం :

గామ ప్రజలకు సరఫరా చేసే ట్యాంకులు క్లోరినేషన్ చేయకుండానే సరఫరా జరుగుతోంది. పంపు హౌస్ వద్ద సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నా పంచాయితీ కార్యదర్శి పర్యవేక్షణ లేక పోవడంతో పంపు హౌస్ వద్ద మోటారును ఆన్ చేసి బయటి వ్యక్తులు పంపుహౌస్ వద్ద తాగునీటి వృధా చేస్తు స్నానాలు చేస్తున్నా పట్టించుకునే నాధుడు లేదు. ఓ హెచ్.ఆర్ వద్ద అపరి శుభ్రవాతావరణం నెలకొని ఉన్నా సంభందిత అధికారి పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తాగునీటిని సరఫరా చేసే వాల్వ్‌లలో పిచ్చిమొక్కలు మొలచి అపరిశుభ్రతను తలపిస్తున్నాయి. పంపు ఆపరేటర్ మొటార్ ను ఆన్ చేసి సొంత పనుల మీద వెళ్లి పోవడంతో ట్యాంకు నిండి తాగునీరు వృధాగా పోతొంది. సంభందిత పంచాయితీ, మండల పరిషత్



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుని గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతున్నారు.

## పిఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్-కమ్-ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం

### చేతివృత్తుల కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టిన ప్రదర్శన





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఎంఎస్ఎంఈ-డిఎఫ్ఓ, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల 'పిఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్-కమ్-ట్రేడ్ ఫెయిర్' గురువారం ఘనంగా ప్రారంభించడం జరిగిందనిఎంఎస్ఎంఈ-డిఎఫ్ఓ, విశాఖపట్నం జాయింట్ డైరెక్టర్ ఆర్. సెంథిల్ కుమార్ పేర్కొన్నారు.

గురువారం దానవాయిపేట లోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈ ప్రదర్శన ఫిబ్రవరి 12, 13, 14 తేదీలలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కొనసాగనుంది.

ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఆర్. సెంథిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రదర్శనలో 50కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసి, హస్తకళలు, కొబ్బరి పీచు, చిప్పల ఉత్పత్తులు, కళాఖండాలు, వివిధ చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారన్నారు. పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఉచితంగా స్టాల్స్ కేటాయించి, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బిజినెస్-టు-బిజినెస్ , బిజినెస్-టు-కస్టమర్ సంబంధాలను మెరుగు పరచడం, విశ్వకర్మ బ్రాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ ప్రదర్శన కమ్ అమ్మకాలు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రాష్ట్రంలో పిఎం విశ్వకర్మ పథకం అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న రుణాలు, శిక్షణ, టూల్‌కిట్ ప్రోత్సాహకాలపై సెంథిల్ కుమార్ వివరించారు. చేతివృత్తుల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజమండ్రి జనరల్ మేనేజర్ శ్రీవనిధర్ రామన్ మాట్లాడుతూ లబ్ధిదారు లకు అవసరమైన మార్గదర్శకాలు, రుణ సౌకర్యాలపై పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, కాకినాడ జనరల్ మేనేజర్ సిహెచ్. గణపతి 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' పథకం లక్ష్యాలను వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.వి. ప్రసాద్ మాట్లాడుతూ రుణాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బ్యాంకులను సంప్రదించాలని, అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి శిక్షణ, స్టైపెండ్ అంశాలపై అవగాహన కల్పించారు. డిఐసిసిఐ ప్రతినిధి జార్జ్ బాబు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరగా, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ స్వర్ణకారులు రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రజలు కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ట్రేడ్ ఫెయిర్‌ను సందర్శించి విశ్వకర్మ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రుణాలు, శిక్షణ, స్టైపెండ్‌లకు సంబంధించి సమస్యలు ఉన్న లబ్ధిదారులు ఈ వేదికను వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, చేతివృత్తుల కళాకారులు పాల్గొన్నారు.

## రద్దీగా ఉండే టెంపుల్ రోడ్డు విస్తీర్ణ తప్పదు..

- గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ జె ఈ సాయి కొలతలు..
- త్వరలో కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయశీ నుండి బస్టాండ్ వరకు భారీ రోడ్డు..
- రెండు వైపులా భారీ విస్తీర్ణంతో రోడ్డు..

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** నిత్యం రద్దీగా ఉండే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం రోడ్డు విస్తీర్ణ తప్పదు. గురువారం సాయంత్రం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నుండి బస్టాండ్ వరకు ఉన్నటువంటి రోడ్డు డబల్ రోడ్డు చేయడం కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొలతలు వేశారు. పంచాయతీరాజ్ జేఈ సాయి కొలతలను పర్యవేక్షించారు. దీర్ఘకాలంగా ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న. అటువంటి మండల కేంద్రం కోరుకొండ రోడ్డుకు విస్తరణ అవసరమైన ఉన్నదని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అనేక పర్యాయములు పలు వేదికలపై వెల్లడించారు ఇందుకు అనుగుణంగా గ్రామపంచాయతీ ముందస్తుగా కొలతలను వేసి ఎంతవరకు విస్తరించవలసిన ఉంటుంది అన్నదానిపై ఒక అవగాహనకి వచ్చినట్లుగా తెలిసింది ప్రసిద్ధి చెందిన కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు తో పాటు చుట్టుపక్కల 20 గ్రామాల వాళ్లు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ఉన్నటువంటి షాపులు కనీసం వాహనాలు పెట్టుకోవడానికి కూడా వీలుగా లేదని స్వామి వారి ఆలయం వద్దకు భక్తులు రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని తరచూ ఇదే రోడ్డులో స్కూల్ బస్సులు ఆటోలో వానలు భారీ వాహనాలు ఇటుక ఎక్కువ వస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందిగా ఉంటుందని రోడ్డుకు దగ్గరగా చిరు వ్యాపారులు వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇక రోడ్డు విస్తీర్ణ తప్పదని నిర్ణయం తీసుకున్నట్లుగా పలుమార్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలియజేయడమైనది రోడ్డు



విస్తీర్ణం వల్ల ట్రాఫిక్ ఎటువంటి ఇబ్బంది ఉండదని ప్రజల అభిప్రాయపడుతున్నారు ఇక రోడ్డు విస్తరణ తప్పదు.

# టీ20 వరల్డ్ కప్: సొంతగడ్డపై లంక జైత్రయాత్ర.. ఒమన్‌పై భారీ విజయం

**టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంకకు వరుసగా రెండో విజయం**

**ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో గెలుపు**

**లంక జట్టులో కుశాల్ మెండిస్, పవన్ రత్నాయకే, శనక హాఫ్ సెంచరీలు**

**ఒమన్ బ్యాటర్ మహమ్మద్ నదీమ్ ఒంటరి పోరాటం**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఆతిథ్య శ్రీలంక జైత్రయాత్ర కొనసాగిస్తోంది. గ్రూప్-బిలో భాగంగా గురువారం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో శ్రీలంక ఘనవిజయం సాధించింది. ఈ మెగా టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో గెలుపు కావడం విశేషం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పసికూన ఒమన్‌ను చిత్తు చేసింది. పల్లెకెలె అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఒమన్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బ్యాటర్లు కుశాల్ మెండిస్ (45 బంతుల్లో 61), పవన్ రత్నాయకే (28 బంతుల్లో 60) అద్భుత అర్ధశతకాలతో రాణించారు. ఆఖర్లో కెప్టెన్ దసున్ శనక కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు.

అనంతరం 226 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. లంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులకే పరిమితమైంది. ఒమన్ జట్టులో మహమ్మద్ నదీమ్ (53 నాటౌట్) ఒక్కడే అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర రెండేసి వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో గ్రూప్-బిలో శ్రీలంక అగ్రస్థానానికి చేరింది.

# నమీబియా బ్యాటర్లకు చుక్కలే: బుమ్రా రెండో మ్యాచ్ ఆడటం కన్ఫామ్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై: టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌కు భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా దూరమైన సంగతి తెలిసిందే. తీవ్ర జ్వరం కారణంగా అతడు మ్యాచ్ ఆడలేదు. అయితే.. అనారోగ్యం నుంచి కోలుకున్న బుమ్రా గురువారం (ఫిబ్రవరి 12) అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో జరగనున్న రెండో మ్యాచులో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుమ్రా హెల్త్ కండీషన్‌పై తిలక్ వర్మ క్లారిటీ ఇచ్చాడు. నమీబియాతో మ్యాచుకు ముందు జరిగిన ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తిలక్ మాట్లాడుతూ.. బుమ్రా ఫిట్‌గా ఉన్నాడని తెలిపాడు. రెండో మ్యాచుకు అతడు అందుబాటులో ఉన్నాడని చెప్పాడు. తిలక్ వ్యాఖ్యలతో నమీబియాతో జరగనున్న రెండో మ్యాచులో బుమ్రా ఆడటం ఖాయమని స్పష్టమైంది. దీంతో భారత యార్కర్ కింగ్‌తో నమీబియా బ్యాటర్లకు చుక్కలు కనిపించడం ఖాయమంటున్నారు అభిమానులు. టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా రెండో మ్యాచ్‌కు రెడీ అయ్యింది. గురువారం జరిగే గ్రూప్‌ఎ లీగ్ మ్యాచ్‌లో పెద్దగా అనుభవం లేని నమీబియాతో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్ తర్వాత పాకిస్తాన్‌తో హై ఓల్టేజ్ మ్యాచ్ ఉండటంతో ఇండియా బ్యాటర్లపై ప్రధానంగా దృష్టి నెలకొంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ మినహా మిగతా వారంతా తేలిపోయారు. ఒక్కరంటే ఒక్కరు వికెట్ కాపాడుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దాంతో నమీబియాతో మ్యాచ్‌లో బ్యాటింగ్ వీరులందరూ గాడిలో పడాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ఏమాత్రం తేడా వచ్చినా రాబోయే మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నమీబియా బౌలింగ్‌ను చితక్కొట్టి తొలిసారి మూడొందల మార్క్‌ను అందుకోవాలని టీమిండియా ప్రణాళికలు వేస్తోంది. ఇది ఎంతవరకు విజయవంతమవుతోంది చూడాలి.

# ఒమన్ బౌలర్లను వణికించిన షనక, పవన్.. అనామక జట్టుపై శ్రీలంక భారీ స్కోర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఒమన్‌తో జరుగుతోన్న మ్యాచులో శ్రీలంక బ్యాటర్లు దుమ్మురేపారు. ముఖ్యంగా శ్రీలంక యంగ్ బ్యాటర్ పవన్ రత్నాయక్, కెప్టెన్ దసునా షనక, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. పవన్ (60), షనక (50), మెండిస్ (61) ముగ్గురు అర్థ సెంచరీలతో హోరెత్తించడంతో శ్రీలంక 20 ఓవర్లలో 220 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన నమీబియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన అతిథ్య శ్రీలంక బ్యాటర్లు అనామక ఒమన్ బౌలర్లపై విశ్వరూపం చూపించారు. ఓపెనర్లు నిశాంక (13), కమిల్ మిశ్రా (8) విఫలమైన.. పవన్ రత్నాయక్, కెప్టెన్ షనక, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ రఫ్ఫాడించారు.

ముగ్గురు హాఫ్ సెంచరీలతో పరుగుల వరద పారించారు. పవన్ 28 బంతుల్లోనే 8 ఫోర్లు, ఒక సిక్స్ బాది 60 పరుగులు.. శనక 20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టి 50 రన్స్ చేశారు. మెండిస్ 75 బంతుల్లో 7 ఫోర్ల సహాయంతో 61 పరుగులు చేసి ఔట్ అయ్యాడు.

చివర్లో కమిందు మెండిస్ (7 బంతుల్లో 19 పరుగులు) మెరుపులు మెరిపించాడు. దీంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఒమన్ బౌలర్లలో జితేన్ రామనంది 2 వికెట్లు పడగొట్టాడు. సుఫ్యాన్ మెహమూద్, ఒడెద్రా చెరో వికెట్ తీశారు.

# రుక్మిణి టాలీవుడ్‌కు మరో రష్మిక అవుతుందా?







కన్నడ భామలకు తెలుగులో మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. -ఛలో- మూవీతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన రష్మిక మందన్న వరుస క్రేజీ ఆఫర్లతో స్టార్ హీరోయిన్ జాబితాలో చేరిపోయింది. తెలుగులో స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న రష్మిక నేషనల్ క్రష్ అనిపించుకుంది. స్వతహాగా కన్నడ అయినా తెలుగు సినిమాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కన్నడ ప్రేక్షకులు రష్మికపై ఫైర్ అయ్యారు.మాతృ భాషకు సంబంధించిన ఇండస్ట్రీని మరిచిందని కామెంట్‌లు చేశారు. ఆ విమర్శల్ని ఎదుర్కొని ఇప్పుడు వన్ ఆఫ్ ది టాప్ హీరోయిన్‌ల జాబితాలో చేరింది. ఇండియా వైడ్‌గా స్టార్ హీరోయిన్‌గా క్రేజ్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా అదే స్థాయిలో పాన్ ఇండియా సినిమాలని దక్కించుకుంటూ యమ బిజీగా గడిపేస్తోంది. 2024లో పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌ని సొంతం చేసుకున్న రష్మిక అదే హవాని కొనసాగిస్తూ గత ఏడాది -చావా-,-కుబేర- వంటి హిట్‌లని తన ఖాతాలో వేసుకుంది.ప్రస్తుతం కాక్‌టైల్ 2, లేడీ ఓరియెంటెడ్ మూవీ -మైసా-ల్లో నటిస్తున్న రష్మిక తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ వరల్డ్ మూవీలో నటించే ఛాన్స్‌ని దక్కించుకుంది. ఇప్పుడు రష్మిక తరహాలో మరో కన్నడ సోయగం రుక్మీణీ వసంత్ నడుస్తున్నట్టుగా తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో రష్మిక పాపులర్ అయినట్టుగానే రుక్మిణి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. రుక్మీణీ వసంత్..కన్నడ నాట మారుమ్రోగుతున్న పేరిది. ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ ఈ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. కాంతార ప్రీక్వెల్ -కాంతార: చాప్టర్ 1తో భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న రుక్మిణి ఈ సినిమాతో తెలుగు మేకర్స్ దృష్టిని ఆకర్షించింది. రెండేళ్ల క్రితమే నిఖిల్ తో -అప్పుడో ఇప్పుడో ఎప్పుడో- మూవీ చేసింది. సుధీర్ వర్మ డైరెక్ట్ చేసిన ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్టే ఎప్పుడొచ్చిందో ఎప్పుడు వెళ్లిందో తెలియకుండానే వెళ్లిపోయింది. దీంతో రుక్మిణి టాలీవుడ్ ఎంట్రీ గురించి పెద్దగా ఎవరికీ తెలియలేదు. -కాంతార:చాప్టర్ 1- తరువాతే టాలీవుడ్ మేకర్ల దృష్టి తనపై పడింది. ప్రస్తుతం రుక్మిణి మాస్ ఆఫ్ యాక్షన్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ మూవీ -డ్రాగన్-లో నటిస్తోంది.దీన్ని భారీ స్కేల్ లో రిలీజ్ చేయాలని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడు. తెలుగు సినిమాలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి మార్కెట్ ఉన్న నేపథ్యంలో రష్మిక మందన్న తరహాలోనే రుక్మిణి కూడా టాలీవుడ్‌కే ప్రాధాన్యతనిస్తుందా? ..లేక కన్నడలోనూ నటిస్తూ రెండు భాషల్లోనూ పాపులారిటీని దక్కించుకోవాలని భావిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965